కాగితాలకే పరిమితం

ఆరు నెలలు దాటినా కార్యరూపం దాల్చని భూముల లీజు వ్యవహారం

హైదరాబాద్, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ): పరిశ్రమల కోసం భూములను లీజుకి ఇచ్చే విధానం కాగితాలు దాటి కార్యరూపం దాల్చడంలేదు. పరిశ్రమ ఏర్పాటు చేసుకునేవారికి భూములను విక్రయించడమే కాకుండా కావాల్సినవారికి లీజుకు కూడా ఇచ్చే విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ, ఇది జరిగి ఆరు నెలలు దాటినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. రాష్ట్రంలో భూముల ధరలు భారీగా పెరగడంతో పరిశ్రమ పెట్టాలనుకునేవారికి భూముల కొనుగోలు తలకు మించిన భారంగా మారింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్‌లో ఆవిష్కరించిన ఎంఎస్ఎంఈ-2024 పాలసీలో లీజు విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. పరిశ్రమల కోసం భూములను విక్రయించడమే కాకుండా అవసరమైనవారికి 30 ఏండ్ల పాటు లీజుకు ఇవ్వాలని, ఇంకా కావాలంటే లీజు గడువును పొడగించే వెసులుబాటు కూడా కల్పిస్తామని ఆ పాలసీలో పేర్కొన్నారు. అంతేకాదు, చిన్నతరహా పరిశ్రమల కోసం షెడ్లు నిర్మించి లీజుకి ఇస్తామని, పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్‌లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను అభివృద్ధిచేసి వాటిలో 20 శాతం ఎంఎస్ఎంఈలకు కేటాయిస్తామని ప్రకటించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో భేష్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పరిశ్రమల కోసం చౌక ధరలకే భూములను కేటాయించడంతోపాటు 90 రోజుల్లోగా డబ్బు చెల్లించే వెసులుబాటుని కల్పిస్తూ టీఎస్ ఐపాస్ చట్టాన్ని ప్రవేశపెట్టింది. దీంతో చాలామంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సులభంగా బ్యాంకుల నుంచి రుణాలు పొంది వ్యాపారాలు ప్రారంభించేవారు. కాగా, కొంతకాలంగా రాష్ట్ర సర్కారు కొత్త ఎంఎస్ఎంఈ పాలసీ పేరుతో గందరగోళ వాతావరణాన్ని సృష్టించడంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. భూములు కొనుగోలు చేయకుండా ప్రభుత్వం వద్ద లీజుకు తీసుకునేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. అయితే దీనిపై ప్రభుత్వం కొత్త నిర్ణయాన్ని ప్రకటిస్తుందో, లీజు విధానం ఎప్పటి నుంచి అమలు చేస్తుందో అర్థంకావడం లేదు.

పాలసీ సరే.. మార్గదర్శకాలేవి!

6 నెలలు దాటినా అమలుకాని ఎంఎస్ఎంఈ విధానం • సందిగ్ధంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం నూతన ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు) పాలసీని తేవడంలో చూపిన శ్రద్ధ.. దాన్ని అమలు చేయడంలో మాత్రం చూపడం లేదు. ఎంఎస్ఎంఈ-2024 విధానాన్ని ప్రవేశపెట్టి 6 నెలలు దాటినా దాని మార్గదర్శకాలు ఇంకా విడుదల చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. దాదాపు ఏడాదిన్నర క్రితం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొత్త ఎంఎస్ఎంఈ పాలసీ వస్తున్నదని రేవంత్ సర్కారు ప్రచారం చేయడంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు దీని కోసం నెలల తరబడి ఎదురుచూశారు. అయితే పాలసీని తెచ్చి ఆరు నెలలు దాటినా ఇంతవరకు మార్గదర్శకాలు ఇవ్వకపోవడంతో ఇంకా ఎదురుచూపులు తప్పడం లేదు. మార్గదర్శకాలు వచ్చేదాకా దరఖాస్తుల ప్రాసెసింగ్ కాకపోవడం వల్ల దరఖాస్తుదారులు వేచిచూడక తప్పని పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వం ఎంఎస్ఎంఈ-2024ను విడుదల చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్ ఐపాస్ చట్టంలోని అంశాలనే స్వల్ప మార్పులతో కొత్త ఎంఎస్ఎంఈ పాలసీని రూపొందించినా.. దాని అమలులో జాప్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో వివిధ వర్గాలకు కల్పిస్తున్న సబ్సిడీలను పెంచడంతోపాటు ప్రభుత్వం ఇచ్చే రాయితీలను బ్యాంకు రుణాలకు గ్యారంటీ కింద చూపే వెసులుబాటు కల్పిస్తామని, ఈ మేరకు బ్యాంకర్లను ఒప్పిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రాయితీల పెంపు విషయం పక్కనపెడితే, అసలు ఇంతవరకు ఆ రాయితీలకు సంబంధించిన బకాయిలనే ప్రభుత్వం విడుదల చేయకపోవడం గమనార్హం. అంతేకాదు సరసమైన ధరలకు భూములను సమకూర్చడమేగాక, ప్రభుత్వం అభివృద్ధి చేసే పారిశ్రామిక పార్కుల్లో 20 శాతం ప్లాట్లు ఎంఎస్ఎంఈలకు రిజర్వు చేస్తామని కూడా ప్రభుత్వం పేర్కొన్నది. అయితే ప్రభుత్వం విడుదల చేస్తున్న వరుస భూసేకరణ నోటిఫికేషన్లకు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. దీంతో ఇండస్ట్రీ పార్కుల వ్యవహారం ఇప్పట్లో ఓ కొలిక్కి వస్తుందా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలకు స్థలాలెక్కడ?

ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను అభివృద్ధి చేసి అందులో 20 శాతం ఎంఎస్ఎంఈలకు కేటాయిస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటించారు. అలాగే రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున చిన్న తరహా ఫ్లాట్ ఫ్యాక్టరీని అభివృద్ధి చేయనున్నట్టు, వీటిలో స్వయం సహాయక సంఘాలు చిన్న వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సాహిస్తామని చెప్పారు. అయితే వీటి కోసం భూసేకరణకుగానీ, నిర్మాణాలకుగానీ ప్రభుత్వం వద్ద నిధులు లేవని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల కోసం సేకరించిన భూములనే కొత్త పారిశ్రామిక వాడలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ కోసం పది జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను అభివృద్ధి చేసింది. రానున్న రోజుల్లో వీటినే కొత్త పారిశ్రామిక వాడలుగా తీర్చిదిద్దే వీలుందని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. దీంతో నిధుల కొరత కారణంగా మిగిలిన హామీల మాదిరిగానే ఎంఎస్ఎంఈ పాలసీ కూడా తయారవుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఎంఎస్ఎంఈ పాలసీకి సంబంధించి మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేస్తే కొంత స్పష్టత వచ్చే వీలుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

సబ్సిడీల పెంపూ.. ఒట్టి మాటేనా?

కొత్త పాలసీలో టీ-ఐడియా పథకం కింద తయారీ సంస్థలకు ఇస్తున్న క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీని 15 శాతం నుంచి 25 శాతానికి పెంచి.. గరిష్ఠ రాయితీ పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలకు సవరిస్తున్నారు. అలాగే టీ-ప్రైడ్ కింద ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న రాయితీలు 35 శాతం నుంచి 50 శాతానికి పెంచుతూ.. గరిష్ఠ రాయితీ పరిమితిని రూ.75 లక్షల నుంచి కోటి రూపాయలకు పెంచనున్నట్టు చెప్తున్నారు. ఇక మహిళా యాజమాన్యంలో నడిచే ఎంఎస్ఎంఈలకు ఇస్తున్న 10 శాతం అదనపు రాయితీని 20 శాతంగా నిర్ణయిస్తూ.. గరిష్ఠ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు వృద్ధి చేయనున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. కానీ అసలు మార్గదర్శకాలే లేకపోవడంతో ఈ కొత్త పాలసీ అమలుకు నోచుకోలేక పోతున్నది. అంతేకాదు సబ్సిడీల బాపతు ఇవ్వాల్సిన రూ.3,000 కోట్ల బకాయిలను కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదు. దీంతో లబ్ధిదారులు ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది.

కవాసకి బైకుపై 30 వేల రాయితీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: స్పోర్ట్స్ బైకుల తయారీ సంస్థ కవాసకి తన వాహన కొనుగోలుదారులకు శుభవార్తను అందించింది. నింజా జెడ్ఎక్స్-10ఆర్ మాడల్‌ను రూ.30 వేల వరకు తగ్గింపు ధరతో విక్రయిస్తున్నట్టు ప్రకటించింది. ఈ ప్రత్యేక ఆఫర్ వచ్చే నెల చివరి వరకు లేదా స్టాక్స్ ఉన్నవరకు ఉండనున్నదని పేర్కొంది. దీంతో నింజా జెడ్ఎక్స్-10 ఆర్ మాడల్ ధర రూ.18.50 లక్షలకు లభించనున్నది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ బైకును కొనుగోలు చేసిన వారికి రూ.30 వేల వరకు ఈఎంఐ క్యాష్‌బ్యాక్ లభించనున్నది.

టారిఫ్‌లపై చర్చించుకోవాల్సిందే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: ఒకప్పుడు ప్రతీకార సుంకాలను విమర్శించిన ధనిక దేశాలే ఇప్పుడు ఒకదానిపై మరొకటి ప్రతీకార సుంకాలను విధించుకుంటుపోతున్నాయని ట్రేడ్ వర్గాలు విమర్శిస్తున్నాయి. గతంలో భారీగా వృద్ధిని నమోదు చేసుకున్న అమెరికా, చైనా దేశాల మధ్య ప్రతీకార సుంకాల రచ్చ జరుగుతున్నదని, ఇది ఎంత వరకు వెళ్తుందో అర్థం కావడం లేదని ఆయా వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రతీకార సుంకాల విధింపుపై ఇరు దేశాల ప్రతినిధులు చర్చించుకోవాల్సిన అవసరం ఉన్నదని, అప్పుడే ఒక కొలిక్కి వచ్చే అవకాశాలుంటాయని ఆ వర్గాలు తెలిపాయి.

వ్యాపార విస్తరణలో తొలి అడుగు సక్సెస్

నైనీ స్ఫూర్తితో ఇతర ఖనిజాల ఉత్పత్తికి చర్యలు

సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : నైనీ బొగ్గు బ్లాక్ ప్రారంభంతో సింగరేణి వ్యాపార విస్తరణలో తొలి అడుగు విజయవంతమయ్యిందని కంపెనీ సీఎండీ ఎన్ బలరామ్ అభిప్రాయపడ్డారు. నైనీ స్ఫూర్తితో ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఖనిజాల ఉత్పత్తికి తాము సన్నద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. నైనీ బొగ్గు బ్లాక్‌ను ప్రారంభించిన సందర్భంగా పలువురు అధికారులు, కార్మిక సంఘాల నేతలు శనివారం రెడ్‌హిల్స్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీని అభినందించి, ఘనంగా సన్మానించారు. నైనీ బొగ్గు బ్లాక్‌లో ఉత్పత్తి కోసం తొమ్మిదేండ్లుగా రిటైర్డ్, ప్రస్తుత సింగరేణి అధికారులు కృషిచేశారని ఈ సందర్భంగా సీఎండీ గుర్తుచేశారు. బొగ్గు ఉత్పత్తితోపాటు, ఇతర ఖనిజాల ఉత్పత్తి సంస్థగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నట్టు, దీంట్లోభాగంగా థర్మల్, పునరుత్పాదక విద్యుత్తు రంగంలోను అడుగు పెట్టడానికి ఇప్పటికే కసరత్తు ప్రారంభించినట్టు చెప్పారు. మరోవైపు, సింగరేణి ప్రాంతంలోని కార్మికుల పిల్లలకు సెంట్రల్ సిలబస్‌తో కూడిన విద్యనందించాలన్న బలరామ్ చొరవ ఫలించింది. రామగుండం -2 ఏరియాలోని సింగరేణి సెక్టర్ -3 పాఠశాలకు సీబీఎస్ఈ అనుమతి లభించింది. డిసెంబర్‌లో సీబీఎస్ఈకి ప్రతిపాదనలు పంపించగా, సీబీఎస్ఈ బృందం తనిఖీ చేసి, తాజాగా శనివారం సీబీఎస్ఈ అనుమతినిచ్చింది. ఈ పాఠశాలలో 1 -8 తరగతులను నిర్వహించనున్నారు. రాబోయే రోజుల్లో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాంగణంలో సీబీఎస్ఈ పాఠశాలను నెలకొల్పనున్నట్లు బలరామ్ తెలిపారు.

ఏటీఎం చార్జీలు పెంచిన కొటక్ బ్యాంక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన కొటక్ మహీంద్రా బ్యాంక్ కూడా ఏటీఎం లావాదేవీలకు చార్జీలను పెంచేసింది. వచ్చే నెల 1 నుంచి అమలులోకి వచ్చేలా లావాదేవీలపై ప్రస్తుతం వసూలు చేస్తున్న ఫీజును రూ.21 నుంచి రూ.23కి పెంచుతున్నట్టు ప్రకటించింది. సొంత ఏటీఎంతోపాటు ఇతర ఏటీఎంలలో ఉచిత లావాదేవీల తర్వాత జరిపే లావాదేవీలకు ఈ ఫీజు వర్తించనున్నదని పేర్కొంది. రిజర్వు బ్యాంక్ ఇటీవల ఏటీఎం చార్జీలు పెంపుపై విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా కొటక్ బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ విషయాన్ని బ్యాంక్ ఖాతాదారులకు ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించింది. మరోవైపు, బ్యాలెన్స్ ఎంక్వైరీ, మినీ స్టేట్‌మెంట్‌పై ప్రస్తుతం విధిస్తున్న చార్జీని రూ.8.50 నుంచి రూ.10కి సవరించింది. బ్యాంక్ ఏటీఎంలో ఐదు లావాదేవీలు ఉచితంగా అందిస్తున్నది. ఆ తర్వాత జరిపే ప్రతీ లావాదేవీలకు ఈ చార్జి వర్తించనున్నదని పేర్కొంది.

ఫెడరల్ బ్యాంక్ ఎఫ్‌డీలపై

వడ్డీరేటు తగ్గింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేట్లను తగ్గిస్తూ ఫెడరల్ బ్యాంక్ నిర్ణయం తీసుకున్నది. కీలక వడ్డీరేట్లను తగ్గిస్తూ రిజర్వు బ్యాంక్ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా బ్యాంక్ ఎఫ్‌డీలపై వడ్డీరేటును పావు శాతం తగ్గించింది. రూ.50 లక్షల లోపు డిపాజిట్లపై 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో వడ్డీరేటు 2.75 శాతానికి దిగొచ్చింది.

పరిస్థితులకు అనుగుణంగా చర్యలు

రిజర్వు బ్యాంక్ గవర్నర్ మల్హోత్రా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19: ప్రస్తుతం కొనసాగుతున్న ప్రతీకార సుంకాల విధింపుపై నెలకొన్న పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు రిజర్వుబ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులను బేరీజ్ వేసుకొని కీలక నిర్ణయాలను వేగవంతంగా తీసుకుంటున్నట్టు చెప్పారు. అయినప్పటికీ దేశీయ ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక మార్కెట్లు స్థితిస్థాపకతను ప్రదర్శించాయని 24వ ఎఫ్ఐఎంఎండీఏ-పీడీఏఐ వార్షికోత్సవ సమావేశంలో చెప్పారు. ప్రస్తుతం ధరల సూచీ ఆరేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయినప్పటికీ అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉంటుందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ 6.5 శాతంగా అంచనావేసినప్పటికీ, వేగవంతమైన వృద్ధిని సాధిస్తున్నది భారతేనని ఆయన స్పష్టంచేశారు.

అబద్ధాలెన్ని చెప్పినా గెలిచేది నిజమే

'తల్లీ కొడుకుల ఎమోషన్‌తో కూడుకున్న ఈ కథ మహిళలకు బాగా కనెక్టయ్యింది. ఈ సినిమాపై కొందరు నెగెటివ్ ప్రచారం చేస్తున్నారు. దయచేసి అలాంటివారు తమ మైండ్‌సెట్‌ని మార్చుకోండి. సినిమాను దీవించండి. స్పాయిల్ చేయకండి. ఇండస్ట్రీని బతకనివ్వండి. అబద్ధాలు ఎన్ని చెప్పినా చివరకు గెలిచేది నిజమే. ఈ విజయమే ఆ నిజం' అని అగ్ర నటి విజయశాంతి అన్నారు. కల్యాణ్‌రామ్ హీరోగా విజయశాంతి కీలక పాత్రలో రూపొందిన యాక్షన్ ఎంటర్టైనర్ 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. శుక్రవారం సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన బ్లాక్‌బస్టర్ సక్సెస్‌మీట్‌లో విజయశాంతి మాట్లాడారు. కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ 'డిస్ట్రిబ్యూటర్స్ కాల్ చేసి బుధవారంలోగా బ్రేక్ ఈవెన్ అవుతుందని చెబుతుంటే ఆనందంగా ఉంది. ఈ సినిమా ఆడియన్స్‌కి నచ్చడానికి కారణం కొత్తదనమే. లాస్ట్ 20 నిమిషాలు ఆడియన్స్‌కి బాగా కనెక్ట్ అయ్యింది. విజయశాంతిగారు లేకపోతే ఈ సినిమా లేదు. అడగ్గానే చేయడానికి ఒప్పుకున్నందుకు ఆమెకు థాంక్స్. తల్లిదండ్రులు లేకపోతే మనం లేము. వారిని జాగ్రత్తగా చూసుకోవడం మన బాధ్యత. ఈ సినిమా చెప్పే నీతి అదే' అని తెలిపారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

మూడో షెడ్యూల్ మొదలు?

ఎట్టకేలకు విహారయాత్రలు ముగించుకొని మహేశ్‌బాబు హైదరాబాద్ చేరుకున్నారు. రాజమౌళి కూడా జపాన్ పర్యటన ముగించుకొచ్చేశారు. వీరిద్దరి కలయికలో రూపొందుతోన్న ప్రతిష్టాత్మక పానిండియా ప్రాజెక్ట్ 'SSRMB29' ప్రారంభం ఆలస్యమైనా.. మొదలైన నాటినుంచి షూటింగ్‌ని మాత్రం జెడ్ స్పీడ్‌తో నడిపించారు రాజమౌళి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన రెండు షెడ్యూల్స్ పూర్తయ్యాయి. మధ్యలో టూర్ వల్ల కాస్త బ్రేక్ పడింది. అయితే.. ముందుగా ప్లాన్ చేసుకున్న ప్రకారం.. ఈ సినిమా షూటింగ్‌కు కావాల్సిన సరంజామానంతా టీమ్ సైలెంట్‌గా సిద్ధం చేసిపెట్టేయడంతో రాజమౌళి, మహేష్‌లు విదేశాల నుంచి తిరిగి రాగానే.. ఏ హడావిడీ లేకుండా పీస్‌ఫుల్‌గా కొత్త షెడ్యూల్ మొదలైపోయింది. ఈ షెడ్యూల్‌లో మహేశ్‌బాబు, ప్రియాంక చోప్రా జాయిన్ అయినట్టు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారని వినికిడి. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాకు సంగీతం: ఎం.ఎం.కీరవాణి.

చిత్రం

స్పోర్ట్స్ డ్రామా 'జింఖానా'

మలయాళంలో బాక్సాఫీస్ హిట్‌గా నిలిచిన 'అలప్పుజ జింఖానా' చిత్రం.. 'జింఖానా' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. 'ప్రేమలు' ఫేం నస్లెన్ ఇందులో ప్రధాన పాత్రధారి. ఖలీద్ రెహమాన్ స్వీయ దర్శకత్వంలో జాబిన్ జార్జ్, సమీర్ కారత్, సుభీష్ కన్నంచెరిలతో కలిసి ఈ స్పోర్ట్స్ డ్రామాకు నిర్మించారు. ఈ నెల 25న విడుదల కానుంది. అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి ట్రైలర్‌ని లాంచ్ చేశారు. కొందరు యువకులు బాక్సింగ్ క్లాస్ కోసం సెయిన్ చేయడంతో ట్రైలర్ మొదలైంది. ట్రైలర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. బాక్సింగ్ అంటే పంచ్‌లు విసరడం మాత్రమే కాదని, ఇది క్రమశిక్షణ, విల్ పవర్‌తో కూడుకున్నదనే సందేశంతో ట్రైలర్ ముగిసింది. లుక్మాన్ అవరన్, గణపతి, బేబీ జీన్, సందీప్ ప్రదీప్, ఫ్రాంకో ఫ్రాన్సిస్ తదితరులు చిత్ర తారాగణం.

ఓ తరాన్ని అర్థం చేసుకోవాలంటే సమయం కావాలి!

'ఒకప్పుడు థియేటర్‌కు వెళ్లగానే సినిమా ప్రపంచంలోకి వెళ్లిన ఫీలింగ్. ఇప్పుడు ఓటీటీ రూపంలో మన ప్రపంచంలోకి సినిమా వచ్చి చేరింది. థియేటర్‌లో ప్రేక్షకుడు తన దృష్టిని సెల్‌ఫోన్‌పై పోనీయకుండా ఏం చేయాలన్నదే ఇప్పుడు ఫిల్మ్ మేకర్స్ ముందున్న అతి పెద్ద సవాలు' అన్నారు ప్రముఖ దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ. ఆయన నిర్దేశకత్వంలో ప్రియదర్శి కథానాయకుడిగా శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన 'సారంగపాణి జాతకం' ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా శనివారం ఇంద్రగంటి మోహనకృష్ణ పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్న విశేషాలు..

- 'సారంగపాణి జాతకం' పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రం. సినిమా చూసి ఇంటికి వెళ్లాక కూడా నాలుగైదు రోజులు పాత్రలు, డైలాగ్స్ గురించి మాట్లాడుకుంటారు. ప్రతీ అంశంలో నాకు పూర్తి సంతృప్తినిచ్చిన సినిమా ఇది.
- జాతకాల విషయంలో నేను మధ్యేవాదిని. నాకు చెప్పిన కొన్ని జోస్యాలు ఫలించాయి. కొన్నిసార్లు విఫలమయ్యాయి. ఈ సినిమాలో నేను జాతకాల ప్రామాణికతను అస్సలు ప్రశ్నించడం లేదు. నమ్మకం అన్నది మనిషికి బలాన్నిచ్చేదిగా ఉండాలి. అయితే అది మూఢనమ్మకంగా మారినప్పుడు మనుషుల్ని బలహీనపరుస్తుంది. దానివల్ల అతని చుట్టూ వున్న వారి జీవితాలు కూడా ప్రభావితమవుతాయి. ఏ నమ్మకమైనా మనిషిని సన్మార్గంవైపు నడిపించాలి... వాళ్లను పిచ్చోళ్లను చేయకూడదనే అంశాన్ని హాస్యప్రధానంగా చూపించాను.
- తరం మారుతున్నప్పుడు వారి ఆలోచనాధోరణిని, సెన్సిబిలిటీస్‌ను అర్థం చేసుకోవడానికి కొంత సమయం పడుతుంది. ప్రస్తుతం నేను అదే ప్రాసెస్‌లో ఉన్నా. నేను ఎంజాయ్ చేస్తూ ప్రేక్షకుల్ని ఆనందపరచగలిగే జోనర్ కామెడీ. నా గత చిత్రాల్లోనూ మంచి హాస్యం ఉంది. అయితే ఈసారి నాటితరంతో పాటు నేటితరం ప్రేక్షకులనూ మెప్పించాలనే తపనతో ఈ సినిమా చేశా. మనం ప్రతీసారి గెలవలేము. నాన్ స్టాప్ సక్సెస్ ఎవరికీ ఉండదు. అయినా ప్రయత్నిస్తూ ముందుకెళ్లాలన్నదే నా ఫిలాసఫీ.

అలాంటి వాడితోనే తాళి కట్టించుకుంటా!

త్రిష ప్రస్తుతం 'థగ్ లైఫ్' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా ఆమె ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో వివాహం గురించి ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. వివాహబంధంపై మీ అభిప్రాయమేంటి? అనే ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ.. 'జరుగుతున్న పరిణామాలు, చూస్తున్న నిదర్శనాలను బట్టి ప్రస్తుతానికైతే పెళ్లిపై నాకంత సదభిప్రాయం లేదు. నిజం చెప్పాలంటే మూడుముళ్ల బంధంపై నాకు నమ్మకం పోయింది. పెళ్లి చేసుకొని చాలామంది అసంతృప్తితో జీవిస్తున్నారు. కొందరైతే విడాకులు తీసుకుంటున్నారు. అలాంటి పరిస్థితి నాకు రాకూడదని కోరుకుంటున్నా' అన్నారు త్రిష. ఇంకా చెబుతూ 'పెళ్లి ఎందుకు చేసుకోలేదు? అనడిగితే నాదగ్గర సమాధానం లేదు. ఎప్పుడు చేసుకుంటారు? అనంటే నాకు తెలియదు. అసలు నాకు పెళ్లి యోగం ఉందో లేదో తెలియదు. పెళ్లి జరిగినా ఓకే.. జరక్కపోయినా ఓకే. నాకైతే బాధ లేదు. మనిషి ఆశాజీవి కాబట్టి ఒక్కటి మాత్రం చెబుతా.. పెళ్లంటూ చేసుకుంటే నచ్చినవాడ్నే చేసుకుంటా. వాడు జీవితాంతం నాకు తోడుంటాడని నమ్మితేనే తాళికట్టించుకుంటా. ఇదిమాత్రం పక్కా' అని చెప్పుకొచ్చారు త్రిష. ఈ సమాధానంతో పక్కనే ఉన్న కమల్‌హాసన్ సైతం షాకయ్యారు.

జంక్షన్‌లో జరిగే ప్రేమకథ

ఈశ్వర్, నైనా సర్వర్ జంటగా నటించిన రియలిస్టిక్ లవ్‌స్టోరీ 'సూర్యాపేట్ జంక్షన్'. అభిమన్యుసింగ్ కీలకపాత్ర పోషించారు. రాజేష్ నాదెండ్ల దర్శకుడు. అనీల్‌కుమార్ కాట్రగడ్డ, ఎన్.శ్రీనివాసరావు నిర్మాతలు. ఈ నెల 25న గ్లోబల్ సినిమాస్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో సినిమా విడుదల కానుంది. ప్రచార చిత్రాలవల్ల సినిమాపై అంచనాలు పెరిగాయని, మంచి కథతో రూపొందిన ఈ చిత్రం తప్పక ప్రేక్షకులకు నచ్చుతుందని హీరో ఈశ్వర్ నమ్మకం వ్యక్తం చేశారు. ఇందులో యాక్షన్ సీన్స్ సహజంగా ఉంటాయని, ఎమోషన్స్ ఆకట్టుకుంటాయని నిర్మాత అనిల్‌కుమార్ కాట్రగడ్డ తెలిపారు. ఈ చిత్రానికి కథ: ఈశ్వర్, మాటలు: సత్య, రాజేంద్ర భరద్వాజ్, కెమెరా: అరుణ్‌ప్రసాద్, సంగీతం: రోషన్ సాలూరి, గౌరహరి, నిర్మాణం: యోగాలక్ష్మి ఆర్ట్ క్రియేషన్స్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.